వాస్తవం

డిజిటల్ పత్రిక

ఉన్నది ఉన్నట్లుగా

డెయిలీ.కామ్

గురువారం 14.05.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)

జర్నలిస్ట్ సంక్షేమ సంఘం

Red 914/2015

జర్నలిస్ట్ సంక్షేమమే పరమావధిగా

జర్నలిస్ట్ హక్కుల కోసం....

వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...

సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

బండికి పోగ రేవంత్‌కు సెగ

పోక్సో కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ వ్యవహారం రోజురోజుకు బలపడుతోంది.సాయి భగీరథ్‌ని అరెస్ట్ చేయకుండా కాపాడుతున్నారని రేవంత్ ప్రభుత్వం , కేంద్ర మంత్రి బండి సంజయ్‌లకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం తీవ్ర రూపం దాల్చింది.ఈ వ్యవహారంలో బండికి సన్‌స్ట్రోక్ తగిలినట్లుగానే కన్పిస్తోంది.

- బండి సంజయ్ రాజీనామా తప్పదా?
- తెరవెనక చక్రం తిప్పుతున్నది వారేనా?
- అనుకూల,వ్యతిరేక ప్రచారం వెనక ఉన్నది ఆయనేనా?
- బండికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ కొట్లాట అందుకేనా?
- రేవంత్ రెడ్డి సర్కార్ భగీరథ్‌ని ఎందుకు కాపాడుతోంది?
- కల్వకుంట్ల కవిత మౌనం అందుకేనా?

కె.ఆర్ ఉన్నమాట

వివరాలు 9లో

రేబిస్‌తో బాలుడి మృతి

కోనరావుపేట, మే 13 : రేబిస్ బారినపడి ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలు.. రాజన్న సిరిసిల్లా జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన లోకుర్తి రాజు, మమత దంపతులకు కొడుకు నిశాంత్(11), కూతురు ఉన్నారు. ఉపాధి కోసం రాజు సౌదీ వెళ్లగా, మమత ఇంటి వద్దే బీడీలు చుడుతున్నది. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నారు. కొడుకు నిశాంత్ ఐదోతరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో గత నెల 23న ఇంటి ముందు స్నేహితులతో క్రికెట్ ఆడుతుండగా పిచ్చికుక్క దాడి చేసింది. తల, కన్ను భాగంలో తీవ్రంగా గాయపరిచింది.వెంటనే సిరిసిల్లలోని ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్లారు. ఈ నెల 7న నిశాంత్‌కు జ్వరం రాగా వైద్యం చేయించారు. అదే రోజు రాత్రి నిశాంత్ రాత్రంతా నిద్రపోకపోవడంతో హైదరాబాద్‌లోని నిలోఫర్‌కు తరలించారు. వైద్యులు బాలుడికి రేబిస్ వ్యాధి సోకిందని నిర్ధారించి చికిత్స అందించారు. బుధవారం సాయంత్రం పరిస్థితి విషమించి మృతి చెందాడు.

విరాట్ సూపర్ సెంచరీ

ఎనిమిదో విజయంతో టాప్ ప్లేస్‌కు ఆర్‌సీబీ

రాయ్‌పూర్: డిఫెండింగ్ చాంపియన్స్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) మరోసారి 'టాప్' లేపే ఆటతో దుమ్మురేపింది. బంతితో ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయినా ఛేదనలో మొనగాడు విరాట్ కోహ్లీ (60 బంతుల్లో 11 ఫోర్లు, 3 సిక్స్‌లతో 105 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగిన వేళ.. ఈ సీజన్‌లో ఆ జట్టు ఎనిమిదో విజయంతో పాయింట్ల పట్టికలో మళ్లీ అగ్రస్థానాన్ని దక్కించుకుంది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ఓడించిన ఆర్‌సీబీ.. ప్లేఆఫ్స్‌కు అడుగుదూరంలో నిలిచింది. కేకేఆర్ నిర్దేశించిన 193 పరుగుల లక్ష్యాన్ని 19.1 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది.'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' కోహ్లీకి అండగా దేవదత్ పడిక్కల్ (27 బంతుల్లో 39, 7 ఫోర్లు) రాణించాడు. తొలుత అంగ్‌క్రిష్ రఘువంశీ (46 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 71), రింకూ సింగ్ (29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌తో 49 నాటౌట్) రాణించడంతో కోల్‌కతా నిర్ణీత ఓవర్లలో 192/4 స్కోరు చేసింది. వరుసగా నాలుగు విజయాల తర్వాత కేకేఆర్‌కు ఇది తొలి ఓటమి కాగా ఓవరాల్‌గా ఆరో పరాభవంతో ప్లేఆఫ్స్ అవకాశాలను దాదాపుగా వదులుకుంది.

హిందువునని నిరూపించుకోవడానికి గుడికే వెళ్లక్కర్లేదు

- ఇంట్లో దీపం వెలిగించినా సరిపోతుంది
- హిందూత్వం ఓ జీవన విధానం
- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 13 : హిందూత్వం ఓ జీవన విధానమని సుప్రీంకోర్టు బుధవారం పేర్కొన్నది. ఒక హిందువు తప్పనిసరిగా గుడికి వెళ్లడం గానీ, ఆచారాలు పాటించడం గానీ అవసరం లేదని, ఇంట్లో దీపం వెలిగించడం కూడా తమ విశ్వాసాన్ని నిరూపించుకోవడానికి సరిపోతుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కేరళలోని శబరిమల ఆలయంతోసహా పలు మతపరమైన ప్రదేశాల్లో మహిళలపై వివక్షకు సంబంధించిన పిటిషన్లపైన, దావూదీ బోహ్రాలతోసహా పలు మతాలు పాటించే మత స్వేచ్ఛ పరిధిపైన విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి సూర్య కాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ అగస్టిన్ జార్జి మాసిహ్, జస్టిస్ ప్రసన్న ఆర్ వారాలే, జస్టిస్ ఆర్ మహాదేవన్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ఉన్నారు. 15వ రోజు విచారణ సందర్భంగా పిటిషనర్లలో ఒకరి తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది డాక్టర్ జీ మోహన్ గోపాల్ తన వాదనలు వినిపిస్తూ మతవర్గాల నుండే సామాజిక న్యాయం కోసం డిమాండ్ వెలువడుతున్నదని అన్నారు. హిందూ మతాన్ని ఒక మత విభాగంగా నిర్వచించారు. తదనంతరం, 1966లో మతం, తత్వశాస్త్రానికి సంబంధించిన అన్ని విషయాల్లో వేదాలను అత్యున్నత ప్రమాణంగా అంగీకరించనవాడే హిందువు అని తీర్పు ఇచ్చారు అని ఆయన చెప్పారు.ఈ వాదనపై జస్టిస్ నాగరత్న స్పందిస్తూ అందుకే హిందూ మతాన్ని ఒక జీవన విధానం అని అంటారు. ఒక హిందువు హిందువుగా కొనసాగడానికి తప్పనిసరిగా గుడికి వెళ్లడం గానీ, ఏదైనా ఆచారాన్ని పాటించడం గానీ అవసరం లేదు అని అన్నారు. ఆచారాలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం లేదని, ప్రజలు తమ విశ్వాసాన్ని కలిగి ఉండటానికి ఎవరూ అడ్డురాలేదని ఆమె అన్నారు. ఒక వ్యక్తి తన గుడిసెలో దీపం వెలిగించినా కూడా అది అతని మతాన్ని నిరూపించడానికి సరిపోతుంది అని సీజేఐ వ్యాఖ్యానించారు. ప్రతి మత ఆచారాన్ని లేదా మత వ్యవహారాలను రాజ్యాంగ ధర్మాసనం ఎదుట వ్యక్తులు ప్రశ్నించకుంటూ పోతే వందలాది పిటిషనర్లు వచ్చి పడతారని, ఫలితంగా ప్రతి మతం చీలిపోతుందని అంతకు ముందు సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. శతాబ్దాల నాటి హిందూ మత ఆచారం చట్టవిరుద్ధం, రాజ్యాంగ విరుద్ధం అని తీర్పునిస్తూ 10 నుంచి 50 సంవత్సరాల వయసుగల మహిళలు శబరిమల అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించకుండా నిరోధిస్తున్న నిషేధాన్ని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 2018 సెప్టెంబర్‌లో 4:1 మెజారిటీ తీర్పుతో తొలగించింది. దీన్ని సవాలుచేస్తూ దాఖలైన పిటిషన్లపై ప్రస్తుతం రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరుపుతున్నది.

శుక్రవారం సిట్ విచారణకు హాజరవుతా..

పేట్‌బషీరాబాద్ పోలీసులకు బండి భగీరథ్ మెయిల్

హైదరాబాద్: పోక్సో కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటోన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ పేట్ బషీరాబాద్ పోలీసులకు ఒక మెయిల్ చేశాడు. తాను శుక్రవారం సిట్ విచారణకు హాజరవుతానని ఆ మెయిల్‌లో పేర్కొన్నాడు. నిజానికి బండి భగీరథ్ సిట్ బుధవారం సిట్ విచారణకు హాజరుకావాలంటూ సిట్ అధికారులు ఈ నెల 12న నోటీసులు జారీచేశారు.సిట్ నోటీసుల ప్రకారం.. భగీరథ్ ఇవాళ మధ్యాహ్నం 2.00 గంటలకు విచారణకు హాజరుకావాల్సి ఉంది. అయితే పరారీలో ఉన్న భగీరథ్ ఈ విచారణకు దుమ్మా కొట్టాడు. అయితే సిట్ విచారణకు పిలిచిన గడువు ముగిసిన తర్వాత మూడు గంటలకు ఆయన పేట్‌బషీరాబాద్ పోలీసులకు మెయిల్ చేశాడు. తాను శుక్రవారం పూర్తి సాక్ష్యాధారాలతో సిట్ విచారణకు వస్తున్నానని ఆ మెయిల్‌లో తెలియజేశాడు. ఈ కేసులో తాను సిట్‌కు అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు.

విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వం

ప్రజలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి

ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ఎంపీ డాక్టర్ కడియం కావ్య

వాస్తవం : స్టేషన్ ఘనపూర్, మే 13:

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పేర్కొన్నారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాల్లో భాగంగా స్టేషన్ ఘనపూర్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి గ్రామ సర్పంచులు, కౌన్సిలర్ల విద్యా అవగాహన సదస్సుకు ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలల బలోపేతం సమాజం చేతుల్లోనే ఉందని, ప్రజాప్రతినిధులు గుడిని ఎంత శ్రద్ధగా చూసుకుంటారో బడిని కూడా అంతే బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఎన్నో ఉన్నత స్థానాలకు చేరుకున్న వారిలో ప్రస్తుతం సర్పంచులు, కౌన్సిలర్లు కూడా ఉన్నారని గుర్తు చేశారు. ప్రభుత్వ బడులు మట్టిలో మాణిక్యాలను తీర్చిదిద్దుతున్నాయని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచే స్టేట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు కూడా వస్తున్నారని తెలిపారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 550కు పైగా మార్కులు సాధించిన 120 మంది విద్యార్థులను సన్మానించినట్లు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత సమాజంపై ఉందని, ముఖ్యంగా పేద విద్యార్థులను గుర్తించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దడంలో సర్పంచులు, కౌన్సిలర్లు ముందుండాలని కోరారు. పాఠశాలలకు అవసరమైన వసతులు కల్పించేందుకు అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ వినయ్ కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి, నియోజకవర్గ ఎంఈఓలు, కౌన్సిలర్లు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

అతివేగంతో ప్రయాణికులను ఢీకొట్టిన స్కార్పియో

వాస్తవం : ఎల్లారెడ్డిపేట

గజ సింగవరం బస్టాండులో ఇద్దరు మహిళ ప్రయాణీకులు బస్సు కోసం నిల్చుండగా బస్సు వస్తున్న సమయంలో వెనుక నుండి అతివేగంగా అజాగ్రత్తగా ఓ వైట్ కలర్ స్కార్పియో వాహనం ఇద్దరు మహిళలు వారి చిన్నారితో ఉండగా ఒక్క సారిగా ఢీకొట్టడంతో ఎగిరి పడిపోయారు. క్షతగాత్రులు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వెంటనే స్థానికులు హాస్పిటల్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రామగుండంలో వికసించిన అరుదైన 'మే' పుష్పం

వాస్తవం : గోదావరిఖని ఆర్సీ

పెద్దపల్లి జిల్లా రామగుండం మండల కేంద్రంలో ప్రకృతి అపురూప దృశ్యాన్ని ఆవిష్కరించింది. ఏడాదికి ఒక్కసారి, కేవలం మే నెలలో మాత్రమే వికసించే అరుదైన 'మే పుష్పం' 'ఇంజపురి శంకర్ – శారద' దంపతుల ఇంటి పెరట్లో పూసి అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది. ఎర్రటి బంతిలా, ఫుట్‌బాల్ సైజులో వికసించిన ఈ పువ్వును చూసేందుకు జనం తండోపతండాలుగా తరలివస్తున్నారు.

ఎర్రటి రంగులో గుండ్రంగా వికసించిన మే ఫ్లవర్. వందలాది సన్నని రేకులతో బంతిలా ఉన్న పువ్వు. పువ్వు చుట్టూ చేరి సెల్ఫీలు దిగుతున్న చిన్నారులు, మహిళలు. ఆకుపచ్చని ఆకుల మధ్యలో అగ్నిగోళంలా మెరిసిపోతున్న పువ్వు. రామగుండం మండల కేంద్రానికి చెందిన శంకర్ శారద నివాసంలో ఈ అద్భుతం చోటుచేసుకుంది. శాస్త్రీయంగా స్కాడోక్సస్ మల్టీఫ్లోరస్ అని పిలిచే ఈ పువ్వును తెలుగులో 'మే పుష్పం', 'అగ్ని పుష్పం' అని పిలుస్తారు. ఇంగ్లీష్‌లో 'ఫుట్‌బాల్ లిల్లీ', 'బ్లడ్ లిల్లీ'గా పేరుగాంచింది. ఎండలు మండిపోతున్న వేళ, వర్షాకాలం రాకకు సూచికగా ఈ పువ్వు వికసిస్తుందని పెద్దలు చెబుతారు. ఏడాది పొడవునా భూమిలో దుంప రూపంలో నిద్రాణంగా ఉండి, మే నెల రాగానే ముందుగా పువ్వును, ఆ తర్వాత ఆకులను విచ్చుకుంటుంది. ఒక్కసారి వికసిస్తే కేవలం 10 నుంచి 15 రోజులు మాత్రమే ఈ అందం కనువిందు చేస్తుంది. అరుదుగా కనిపించే ఈ పువ్వును చూసేందుకు చుట్టుపక్కల ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు షార్ట్ ఫిల్మ్ పోటీలు

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జాతీయ స్థాయి షార్ట్ ఫిల్మ్ పోటీల్లో యువత, సినీ అభిరుచి గలవారు పాల్గొనాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

వాస్తవం : హనుమకొండ

మానవ హక్కుల పరిరక్షణ, సామాజిక బాధ్యతలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు భారత జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో 2026 సంవత్సరానికి సంబంధించి 12వ జాతీయ స్థాయి "హ్యూమన్ రైట్స్ షార్ట్ ఫిల్మ్ కాంపిటిషన్" నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ నేడోక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా మానవ హక్కుల పట్ల చైతన్యం కల్పించడం లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి భారత పౌరుడు పాల్గొనవచ్చని తెలిపారు. 3 నుండి 10 నిమిషాల నిడివి గల షార్ట్ ఫిల్మ్‌లను ఏ భారతీయ భాషలోనైనా రూపొందించవచ్చని, అయితే ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్ తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. ఇంగ్లీష్‌లో రూపొందించిన చిత్రాలను కూడా పంపవచ్చన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు ప్రకటించినట్లు తెలిపారు. ప్రథమ బహుమతి రూ. 2,00,000/–, ద్వితీయ బహుమతి రూ. 1,50,000/–, తృతీయ బహుమతి రూ. 1,00,000/– కాగా, ప్రత్యేక ప్రస్తావనకు ఎంపికైన నాలుగు చిత్రాలకు తలా రూ. 50,000/– చొప్పున బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ పోటీల సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాకతీయ యూనివర్సిటీ, శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్లు జిల్లా పరిధిలోని డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలలకు తెలియజేయాలని, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అన్ని జూనియర్ కళాశాలలకు, జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాలలకు, జిల్లా

పంచాయతీ అధికారి గ్రామపంచాయతీలకు, జిల్లా సంక్షేమ అధికారి స్వచ్ఛంద సంస్థలకు సమాచారం చేరవేయాలని సూచించారు. జిల్లా పౌరసంబంధాల అధికారి విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. పోటీలకు సంబంధించిన ఎంట్రీలను 2026 జూన్ 30వ తేదీ లోగా గూగుల్ డ్రైవ్ లింక్ ద్వారా nhrcshortfilm @gmail.com కు పంపాలని తెలిపారు. పూర్తి నిబంధనలు మరియు వివరాలు ఎన్‌హెచ్‌ఆర్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.

కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు

రైతులు, రైల్వేలు, పరిశ్రమలకు భారీ ఊతం

ఢిల్లీ, మే 13 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం బుధవారం ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ఈ సమావేశంలో పశ్చిమాసియా సంక్షోభం, పెరుగుతున్న గ్లోబల్ ఆయిల్ రేట్స్, ఇంధన సంరక్షణ, వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ క్లాసెస్, బంగారం కొనుగోళ్ల వాయిదాపై చర్చించినట్లు సమాచారం. అలాగే, ఖరీఫ్ సీజన్ మద్దతు ధరల నుంచి కోల్ గ్యాసిఫికేషన్, రైల్వే ప్రాజెక్టులు, విమానాశ్రయ ఆధునికీకరణ వరకు భారీ కేటాయింపులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దేశవ్యాప్తంగా రైతులకు మద్దతుగా ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరల అమలుకు కేంద్ర కేబినెట్ రూ. 2,60,000 కోట్ల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా రైతులకు పంటలకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు వ్యవసాయ రంగానికి ఆర్థిక భరోసా లభించనుంది. దేశంలో బొగ్గు వినియోగాన్ని ఆధునికీకరించేందుకు కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు రూ. 37,500 కోట్ల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశంలో ఇంధనాలపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు దేశీయ పరిశ్రమలకు మద్దతు లభించనుంది. గుజరాత్‌లో సర్కేజీ – ధోలేరా మధ్య సెమీ హైస్పీడ్ డబుల్ రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం

తెలిపింది. ఈ ప్రాజెక్టుకు రూ. 20,065 కోట్ల వ్యయాన్ని కేటాయించింది. రైల్వే కనెక్టివిటీ మెరుగుపడి పారిశ్రామిక అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

ధాన్యం కొనుగోలులో

అలసత్వం చేస్తే సహించేది లేదు

మంత్రి పొన్నం ప్రభాకర్

గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లతో

ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు

వాస్తవం : చిగురుమామిడి:

ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో అధికారులు సిబ్బంది అలసత్వం చేస్తే సహించేది లేదన్నారు. గన్ని బ్యాగ్స్ ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం త్వరితగతిన మిల్లులకు పంపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేసుకుంటూ ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలన్నారు. అనంతరం గ్రామంలోని పలువురు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గృహప్రవేశాలను ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రభుత్వం మాట నిలుపుకొని ఇల్లు లేని పేదలకు ఇండ్ల మంజూరు చేస్తుందన్నారు. మొదటి దశ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ చివరి దశలో ఉందన్నారు. జూన్ నెల నుండి రెండవ దశ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రారంభం కాబోతుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు తొందరగా ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. స్థానిక నాయకత్వం కూడా వారికి సహకరించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో పది సంవత్సరాలు ఎదురు చూసినా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు రాలేదని, నేడు ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో పేదలకు ప్రతి ఏడాది 3500 ఇండ్లను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. పేద ప్రజలు ఆర్థిక వెసులుబాటు కల్పించుకొని ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకోవాలన్నారు. ఈ

కార్యక్ర మంలో సర్పంచ్ గూళ్ళ రజిత రాజు, హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ ఇను గాల శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ డిసిసి ఉపాధ్యక్షుడు, గీకు రవీందర్, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఠాకూర్ నరేందర్ సింగ్, జిల్లా నాయకులు, వార్డు మెంబర్లు, రైతులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓడిపిలవంచలో

వైభవంగా అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

వాస్తవం : కాటారం

కాటారం మండలం ఓడిపిలవంచ గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో అభయాంజనేయ స్వామి ప్రతిష్ఠా మహోత్సవాన్ని భక్తిశ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు కొనసాగిన ఈ మహోత్సవాల్లో ప్రత్యేక పూజలు, హోమాలు, యాగాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించి ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపారు. మూడవ రోజు ప్రధానోత్సవంలో వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి, బలిప్రదానం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు భక్తిశ్రద్ధల మధ్య కొనసాగాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు.

నీట్ పేపర్ లీకేజీ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం

టీపీఎఫ్

వాస్తవం : కాటారం

దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్-2026 పరీక్షలో జరిగిన పేపర్ లీకేజీ ఘటన అత్యంత దారుణమని తెలంగాణ ప్రజా ఫ్రంట్ (టీపీఎఫ్) జిల్లా అధ్యక్షుడు పీక కిరణ్ విమర్శించారు. కాటారంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజస్థాన్‌లోని సికర్ ప్రాంతం నుంచి లీకేజీ నెట్‌వర్క్ బయటపడిందని, వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా ప్రశ్నాపత్రాలు ప్రచారం అయ్యాయని ఆరోపించారు. పరీక్ష అనంతరం అసలు ప్రశ్నాపత్రంతో వందకు పైగా ప్రశ్నలు సరిపోవడం పరీక్షా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదువుతుంటే, డబ్బు, అవినీతి, కోచింగ్ మాఫియా, రాజకీయ సంబంధాల ఆధారంగా కొందరికి ప్రశ్నాపత్రాలు చేరడం అత్యంత ప్రమాదకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం పేపర్ లీక్ కాదని, విద్యార్థుల భవిష్యత్తును అమ్ముకునే విద్యా మాఫియా కుట్ర అని విమర్శించారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించలేని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీఎఫ్ జిల్లా నాయకులు అయిత బాపు, దాసరి రమేష్, దారకొండ సూర్యశంకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి అనుగుణంగా

లారీల సంఖ్యను పెంచాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

వాస్తవం : కోనరావుపేట

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్యను పెంచాలని ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్ లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కోనరావుపేట మండలం మర్తనపేట, నాగారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ....ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలని, మిల్లులకు తరలించాలని సూచించారు. మిల్లర్‌లు హమాలీల సంఖ్య ను పెంచి వెంట వెంటనే ధాన్యం అన్ లోడింగ్ చేయాలని ఆదేశించారు. లారీల ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వెంటనే వాహనాల సంఖ్య పెం చాలని, ధాన్యానికి అనుగుణంగా వాహనాలను సమకూ ర్చాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో డీఆర్ డిఓ లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అష్టల్ బేగం, తహసీల్దార్ వరలక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.

పంట సాగులో నేలని కాపాడుకోవడం ముఖ్యం

వాస్తవం : మనోహరాబాద్:

పంట సాగులో మొదటిగా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని వ్యవసాయ శాస్త్రవేత్తలు అన్నారు. మనోహరాబాద్ మండలంలోని చెట్ల గౌరవరం గ్రామంలో వ్యవసాయ అధికారి సచిన్ ఆధ్వర్యంలో బుధవారం రైతు ముంగిట శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పంటల సాగు పై అవగాహన కల్పించారు. ముందుగా నేల ఆరోగ్యంగా ఉంటేనే వ్యవసాయంలో అధిక దిగుబడులు వస్తాయన్నారు. అందుకుగాను భూమి స్వభావం, పోషకాలు, తేమ స్థితి వంటి అంశాలను తెలుసుకోకుండా ఎరువులు వాడడం వల్ల ఖర్చులు పెరిగి దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు. అందు వల్ల ప్రతి రైతు తన పొలానికి మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు చేయించుకోవాలని, దాని ఆధారంగా పంటలకు అవసరమైన పోషకాలను సరైన మోతాదులో అందించాలని సూచించారు. అనంతరం సేంద్రియ ఎరువుల వినియోగం, యూరియాను మోతాదుకు మించి వాడకుండా చూసుకోవడం, యూనివర్సిటీ యొక్క మెలకువలను వాడడం, యూనివర్సిటీ, వ్యవసాయ శాఖ వారి సలహాలు, సూచనలతో పంట సాగు పై రైతులకు పూర్తి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సునీత, ప్రమీల, సర్పంచి దివ్య శ్రీహరి గౌడ్, ఏ ఈ సచిన్, పాలకవర్గ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ సంక్షేమ సంఘం

Red 914/2015

జర్నలిస్ట్ సంక్షేమమే పరమావధిగా

జర్నలిస్ట్ హక్కుల కోసం....

వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...

సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

విద్యా వారోత్సవాలను విజయవంతం చేయండి

ప్రజా ప్రతినిధులకు శిక్షణ

వాస్తవం : వేములవాడ

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 లో బాగంగా విద్యా వారోత్సవాలు (మే 11 నుండి మే 18 వరకు) నిర్వహించే కార్యక్రమంలో భాగంగా వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గం స్థాయి సర్పంచ్ లు, వేములవాడ మున్సిపాలిటీ వార్డు సభ్యులకు బుధవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం వెంకటేశ్వర కన్వెన్షన్ హాల్ లో నిర్వహిస్తుండగా ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్ ,వేములవాడ శాసనసభ్యులుఆది శ్రీనివాస్, వేములవాడ మున్సిపల్ చైర్మన్ రాజు, ఏఎంసీ చైర్మన్ రొండి రాజు, నియోజకవర్గం లోని అన్ని మండలాల విద్యాధికారులు, జిల్లా విద్యాశాఖ కో-ఆర్డినేటర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఏపిసి,

ప్రభుత్వ పాఠశాలలలో తీసుకుంటున్న వివిధ కార్యక్రమాలు అభివృద్ధికి గురించి తెలియజేశారు. కొత్తగా ప్రభుత్వం ఏర్పడ్డ నుండి రాష్ట్రంలో 10046 ఉపాధ్యాయ పోస్టులు 20వేలకు పైగా ఉపాధ్యాయులకు ప్రమోషన్లతో విద్యా వ్యవస్థను బలోపేతం చేసామని ఏఏ పీసీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ బి జగన్మోహన్ రెడ్డి, కో-ఆర్డినేటర్స్ దొబ్బెడ హనుమాన్లు, మండల విద్యాధికారులు కిషన్, వినయ్, సదానందం, శ్రవణ్ కుమార్, రామకృష్ణ , మురళి నాయక్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇందారంలో తాగునీటి సమస్యకు చెక్

12వ వార్డులో నూతన బోర్‌వెల్ ప్రారంభించిన సర్పంచ్ ఫయాజ్

వాస్తవం : జైపూర్

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ ఇందారం గ్రామంలో తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు చర్యలు చేపట్టామని సర్పంచ్ మహమ్మద్ ఫయాజ్ తెలిపారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామం 12వ వార్డులో మంగళవారం నూతన బోర్‌వెల్‌ను గ్రామస్తులతో కలిసి ప్రారంభించారు.మంత్రి డా.జి.వివేక్ వెంకటస్వామి దృష్టికి గ్రామ నీటి సమస్యను తీసుకెళ్లగా, ఆయన చొరవతో నూతన బోర్లు మంజూరయ్యాయని ఫయాజ్ వెల్లడించారు. గ్రామంలో ఇకపై మంచినీటి ఎద్దడి లేకుండా అవసరమైన చోట్ల బోర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎల్కటూరి శివ, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాలు, తడక పేరుతో రైతులను దోపిడీకి గురిచేస్తే సహించేదిలేదు

-ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

వాస్తవం : భూపాలపల్లి

భూపాలపల్లి ఐడిఓసి కార్యాలయంలో ధాన్యం, మక్కలు కొనుగోలుపై రెవిన్యూ, పౌరసరఫరాలు, పౌరసరఫరాల సంస్థ, వ్యవసాయ, మార్కెటింగ్ రవాణ, డిఆర్డిఓ, సహకార, పంచాయతీరాజ్, రైస్ మిల్లర్లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే రైతుకు ట్రక్ షీట్ ఇవ్వకపోవడం పట్ల రైతుల ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ 30 రోజులు దాన్యం, మక్కల కొనుగోలులో చాలా ప్రతిష్టాత్మమని ప్రభుత్వం చాలా సీరియస్ గా తీసుకుందని తెలిపారు. సమావేశాల్లో మాట్లాడుకున్నది క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంటా వేసిన తదుపరి రైతుకి ఏమి సంబంధమని, ట్రక్ షీట్ జారీ చేయకుండా ఎందుకు జాప్యం చేస్తున్నారని, దాని వల్ల రైతుల ఇబ్బందులకు గురి గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఫల్యం జరుగుతుందని అందుకు ఆయా శాఖల అధికారులు బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. తాలు పేరుతో అబద్ధాలు ఆడొద్దని సూచించారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీస్ వ్యవసాయ శాఖ అధికారులతో వరి కోత యంత్రాల యజమానులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. తాలు, తరుగులు తీయొద్దని మిల్లర్లుకు పలుమార్లు చెబుతున్నప్పటికీ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వహిస్తున్నారని అటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ రవాణాలో ఇబ్బందులు కల్పిస్తే ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్ పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రవాణాలో ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఇదే చివరి వార్నింగ్ అని హెచ్చరించారు. రైతులకు 48 గంటల్లో నగదు జమ చేసేందుకు కొనుగోలు జరిగిన వెంటనే ఓపిఎంఎస్‌లో నమోదు చేయాలని తెలిపారు. రైస్ మిల్లులు వద్ద దాన్యం దిగుమతి పర్య వేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించినట్లు తెలిపారు. ప్రతిరోజు ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డిఆర్ఓ వసంతకుమారి, పౌరసరఫరాల శాఖ అధికారి కిరణ్ కుమార్, డిఎం రాములు, వ్యవసాయ అధికారి బాబూరావు, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, రమణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని, డిఆర్డిఓ బాలకృష్ణ, సహకార అధికారి వాలియా నాయక్, డిపిఓ శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ యాప్‌తో అన్ని విద్యుత్ సేవలు

ఏడీఈ రమేష్

వాస్తవం : కాటారం

విద్యుత్ వినియోగదారులకు సేవలను మరింత సులభతరం చేసి ప్రజలకు చేరువ చేయడానికి టీజీఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకు వచ్చినట్లు కాటారం ఏడీఈ రమేష్ తెలిపారు. ఈ యాప్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు, కొత్త కనెక్షన్ దరఖాస్తులు, ఫిర్యాదుల నమోదు, సేవల స్థితి తెలుసుకోవడం వంటి అనేక సేవలను ఇంటి వద్ద నుంచే సులభంగా పొందవచ్చన్నారు.ప్రజలు విద్యుత్ కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా మొ బైల్ ద్వారానే సేవలను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. వినియోగదారులు గూగుల్ ప్లే స్టోర్ లో నుంచి టీజీఎన్ పీడీసీఎల్ మొబైల్ యాప్‌ను డౌన్ లోడ్ చేసుకుని అందు బాటులో ఉన్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆర్డీవోను మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు

వాస్తవం : కాటారం

కాటారం నూతన ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన రవీందర్‌ను ఈజీసీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ దండు రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి పూల బొకే అందజేసి అభినందనలు తెలిపారు.నూతన బాధ్యతల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రత్యేక చొరవ చూపాలని నాయకులు కోరారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి చేరేలా కృషి చేయాలని సూచించారు.కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పంతకాని సమ్మయ్య, కొండ గొర్ల రాంనారాయణ, ఆత్మకూరి కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ప్రభుత్వ విప్

వాస్తవం : వేములవాడ

వేములవాడ అర్బన్ మండలం చిర్లవంచ, గుర్రవానిపల్లె గ్రామాల్లో బుధవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్య, వ్యవసాయానికే ప్రథమ ప్రాధాన్యత

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

ఔటర్‌గా సిద్దిపేట - కరీంనగర్ రోడ్డు అనుసంధానం

విద్యా వారోత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్

వాస్తవం : హుస్నాబాద్ :

విద్యార్థి నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించిన నేను విద్యకు మరియు వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యతను ఇస్తానని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యకు ప్రాధాన్యతను ఇస్తూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను నిర్మించ తలపెట్టిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా హుస్నాబాద్ వైశ్య భవన్‌లో హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, బెజ్జంకి మండలాల సర్పంచులు, కౌన్సిలర్లతో ఏర్పాటు చేసిన విద్యా వారోత్సవాల్లో ఎడ్యుకేషన్ వర్క్ షాప్ కు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఇంటర్మీడియట్ ప్రభుత్వ బాలురు బాలికల కాలేజీల్లో సాంఘిక సంక్షేమ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల అక్కన్నపేట ట్రైబల్ స్కూల్స్ లలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థి, విద్యార్థినిలను అభినందించి సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ ఉండడం వల్లే కోహెడ మండలం తంగళ్ళపల్లి లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం జరుగుతుందని, హుస్నాబాద్ శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ తెచ్చామని, ఎలుకతుర్తిలో బాసర ట్రిపుల్ ఐటీ వస్తుందని చెప్పారు. అందువల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించే విధంగా చూసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కూడా ప్రైవేట్ కు దీటుగా మౌలిక వసతులు కల్పించామన్నారు. ఇందుకుగాను గ్రామాల్లో ఉండే సర్పంచులు ప్రత్యేక చొరవ తీసుకొని గ్రామాల్లోకి ప్రైవేటు పాఠశాల బస్సులు రాకుండా చూసుకొని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచి గ్రామ రూపురేఖలు మార్చాలి అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా బడిబాట కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి తిరిగి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో చేరేలాగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగం, ప్రభుత్వ పథకాలు కావాలి గాని ప్రభుత్వ విద్య వైద్యం వద్దు

అనే విధంగా ప్రజల జీవన విధానం మారిందన్నారు. గ్రామాల్లో బడిని అభివృద్ధి చేసి పిల్లలను చేర్పిస్తే పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. అంతకుముందు మంత్రి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఆరెపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపడుతుందని చెప్పారు. గన్ని బ్యాగ్స్,ధాన్యం సేకరణ కేంద్రాల నుండి మిల్లులకు రవాణా ఇబ్బందులు లేకుండా లారీలు వచ్చే విధంగా అధికారులు అప్రమత్తత వహిస్తూ ఉండాలని ఆదేశించారు. అనంతరం హుస్నాబాద్‌లో ఉన్న కొత్తచెరువు అభివృద్ధి పనులను పరిశీలించారు. కట్ట సుందరీకరణ తూము అభివృద్ధి పనులు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కట్ట వెడల్పు పూర్తయితే దశల వారీగా సిసి పనులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్త చెరువు కట్ట లింకు రోడ్డును సిద్దిపేట జాతీయ రహదారి లింకు నుండి హుస్నాబాద్ కరీంనగర్ ఔటర్ రోడ్డుగా ఉపయోగించవచ్చన్నారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, డి ఈ ఓ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రామ్మూర్తి, ఎంఈఓ లు, నాలుగు మండలాల సర్పంచులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యపానం నిషేధిస్తూ

గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మానం

మద్యపాన రహిత గ్రామంగా లక్ష్మీదేవికాల్వ

వాస్తవం : అడ్డగూడూరు :

యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల పరిధిలోని లక్ష్మిదేవికాల్వ గ్రామంలో బుధవారం గ్రామంలో సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేస్తూ ప్రత్యేక గ్రామసభలో గ్రామ ప్రజల అభిప్రాయం మేరకు గ్రామ పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. సామాజిక మార్పులో ఆదర్శంగా నిలిచింది. గ్రామస్థుల ఆరోగ్యం, కుటుంబాల ఆర్థిక అభివృద్ధి, శాంతిభద్రతలను మెరుగుపరచడమే లక్ష్యంగా మద్యం కారణంగా కుటుంబాలు చితికిపోవడాన్ని గమనించిన సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ నిర్ణయం పట్ల ముఖ్యంగా మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.సామాజిక మార్పు అనేది కేవలం నినాదాలతోనే రాదు.. గట్టి సంకల్పంతో వస్తుందని నిరూ

పించింది యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూర్ మండలంలోని లక్ష్మీదేవికాల్వ గ్రామం. ఈ గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేస్తూ గ్రామ పంచాయతీ ఏకగ్రీవంగా చారిత్రాత్మక తీర్మానం చేసింది. గ్రామ యువత, పెద్దలు, మహిళలు ఏకతాటిపైకి వచ్చి తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. లక్ష్మీదేవికాల్వ గ్రామంలో గత కొంతకాలంగా మద్యం మహమ్మారి కారణంగా అనేక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయి. కూలీ పనులకు వెళ్లి సంపాదించిన డబ్బు నంతా మద్యానికి ఖర్చు చేయడంతో పిల్లల చదువులు, ఆరోగ్యం నిర్లక్ష్యానికి గురవుతున్నాయని గ్రామస్థులు గుర్తించారు. దీనికి తోడు తాగి వచ్చి ఇళ్లలో గొడవలు పడటం, ఊరిలో చిన్న చిన్న గొడవలు శాంతిభద్రతలకు విఘాతం కలిగించడాన్ని గ్రామ పంచాయతీ సీరియస్‌గా తీసుకుంది. ఈనెల 20 నుండి పూర్తిగా మద్యపానం, గుట్కా, తంబాకు పూర్తి నిషేధానికి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ వల్లంబట్ల రమాదేవి, ఉప సర్పంచ్ కంబాల వీరయ్య, పంచాయతీ సెక్రటరీ గిరిబాబు, వార్డు సభ్యులు పొన్నాల లక్ష్మి, పర్రెపాటి ముత్తిలింగం, అనిత, రేణుక, గ్రామ పెద్దలు రవీందర్ రావు, గంగరాజు, బొమ్మగాని లక్ష్మయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు, మహిళా సంఘం అధ్యక్షురాలు రమణ, వి బి కే లక్ష్మీకాంత, మహిళా సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కమిటీల ఏర్పాటుకు

దరఖాస్తుల స్వీకరణ

జైపూర్ : వాస్తవం

జైపూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మండల గ్రామ కమిటీల ఏర్పాటుకు బుధవారం దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు.పార్టీ అధిష్టానం రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ కొనసాగుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చల్ల విశ్వంబర్ రెడ్డి తెలిపారు.మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు సంబంధించి ప్రతి గ్రామం నుంచి రెండు నుంచి మూడు వరకు దరఖాస్తులు అందినట్లు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా అన్ని కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఈ కమిటీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.గురువారం కూడా దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతుందని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,కార్యదర్శులు గోనె నర్సయ్య,జనార్ధన్ రెడ్డి,స్థానిక సర్పంచ్ కూన భాస్కర్,ఉప సర్పంచ్ ఇరిగిరాల శ్రావణ్,మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్ కాంగ్రెస్,పార్టీ సీనియర్ నాయకులు అంబల్ల రవి,సంపత్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను

సద్వినియోగం చేసుకోవాలి

చందుర్తి సర్పంచ్ పులి సత్యం గౌడ్

వాస్తవం : చందుర్తి

చందుర్తి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చందుర్తి సర్పంచ్ పులి సత్యం గౌడ్ కోరారు. 2026 27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల కరపత్రాన్ని బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో కళాశాల అధ్యాపక బృందంచే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్యం గౌడ్ మాట్లాడు తూ....కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో విద్యాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. విద్యాశాఖను రేవంత్ రెడ్డి తన వద్దనే ఉంచుకొని విద్యా విధానంలో సమూల మార్పులు చేస్తు న్నారన్నారు. విద్యార్థులు ప్రభుత్వ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు, అధ్యాపకులు కృష్ణ మాట్లాడుతూ ....చందుర్తి ప్రభుత్వ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం మంచి ఫలితాలు రావడం జరిగిందని, అదే స్ఫూర్తితో రానున్న విద్యా సంవత్సరంలో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కళాశాలలో ఎంపీసీ,బైపీసీ, సిఈసి కోర్సులు అందుబాటులో ఉన్నాయని ఆంగ్లంలో బోధన చేయడం జరుగుతుందన్నారు. అలాగే చందుర్తి కళాశాలలో డిజిటల్ తరగతులు అందుబాటులో ఉన్నాయన్నారు. కళాశాలలో విద్యార్థులకు ఉదయం అల్పాహారం కూడా అందుబాటులోకి రానుందని తెలిపారు. చందుర్తి మండల ప్రజలతో పాటు పరిసరాల ప్రజలు ప్రభుత్వ కళాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

రైస్ మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్

వేగవంతం చేయాలి

జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

వాస్తవం : వేములవాడ

రైస్ మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. వేములవాడ మండలం మల్లారం, మర్రిపల్లి, చందుర్తి మండల కేంద్రం, మల్యాల, మూడపల్లి, రుద్రంగిలోని కొనుగోలు కేంద్రాలు, వేములవాడ మండలం మర్రిపల్లిలోని మారుతి, మహాలక్ష్మి, మణికంఠ రైస్ మిల్లులను బుధవారం అదనపు కలెక్టర్ తనిఖీ చేసి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, రైస్ మిల్లుల యజమానులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని జాప్యం చేయకుండా తూకం వేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఈ తనిఖీలో రుద్రంగి, చందుర్తి తహసీల్దార్‌లు పుష్పలత, భూపతి అధికారులు ఉన్నారు.

మున్సిపాలిటీలో కోఆప్షన్ సభ్యుల ఎన్నిక

వీడని పీఠముడి, భిన్నాభిప్రాయాల మధ్య ఒకటి పెండింగ్

వాస్తవం : హుస్నాబాద్ :

హుస్నాబాద్ మున్సిపాలిటీలో బుధవారం కోఆప్షన్ సభ్యుల ఎన్నికకు సంబంధించి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. స్వయంచాలకంగా మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. నలుగురు కో ఆప్షన్ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉండగా, మున్సిపాలిటీలో కో ఆప్షన్ సభ్యుల ఎన్నికకు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ గౌడ్ ఓటింగ్ నిర్వహించారు. జనరల్ కేటగిరీలో కో ఆప్షన్ సభ్యులుగా పున్న లావణ్య మరియు భూక్య సరోజన ఎన్నికయ్యారు. ఇక మైనారిటీ విభాగంలో కో ఆప్షన్ సభ్యుడిగా మహమ్మద్ హసన్ లాల్ ఎన్నిక కాగా భిన్నాభిప్రాయాల మధ్య పెండింగ్ లో మరొక కోఆప్షన్ సభ్యుడు ఎన్నిక కావాల్సి ఉంది. కాగా కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నికైన పున్న లావణ్య, భూక్య సరోజన, మహమ్మద్ హసన్ ల చేత మున్సిపల్ కమిషనర్ ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన కోఆప్షన్ సభ్యులకు మంత్రి శుభాకాంక్షలు తెలియజేశారు. ఏకాభిప్రాయం అయిన పిదప దీనిని కూడా పూర్తి చేస్తామన్నారు. కొత్తగా ఎన్నికైన కో ఆప్షన్ సభ్యులు హుస్నాబాద్ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. నియోజకవర్గాన్ని రాజకీయాలకు అతీతంగా ముందుకు తీసుకుపోవాలని, మున్సిపాలిటీకి మంచి పేరు తెచ్చే విధంగా కౌన్సిలర్లతో కలుపుకొని ఐక్యతగా ముందుకు పోవాలన్నారు.

ఎల్ఓసిని మంజూరు చేసిన ఆది శ్రీనివాస్

వాస్తవం: చందుర్తి

చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన చింత కుంట లక్ష్మి తీవ్ర అనారోగ్యంతో అత్యవసర చికిత్స అవసరమైన విషయం తెలుసుకున్న వెంటనే తెలంగాణ రాష్ట్ర ప్రభు త్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తక్షణమే స్పందించి నిమ్స్ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి ప్రత్యేక చికిత్స అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వం నుండి రూ. 1,50,000 విలువైన ఎల్ ఓ సిను వైద్య ఖర్చుల కోసం వెంటనే మంజూరు చేయించారు. ఈ సహాయం అందించడంతో బాధిత కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తు ఆది శ్రీనివాస్‌కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

బీసీ సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడిగా మార్త వెంకన్న యాదవ్

వాస్తవం : అడ్డగూడూరు :

అడ్డగూడూరు మండల బిసి సంక్షేమ సంఘం యూత్ అధ్యక్షుడిగా మార్త వెంకన్న యాదవ్ ను నియమిస్తూ హైదరాబాద్ లోని బీసీ సంఘం కార్యాలయంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డా. ర్యాగ అరుణ్ కుమార్ లు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమాకమైన మార్త వెంకన్న యాదవ్ మాట్లాడుతూ మండలంలో బీసీ సంఘం బలోపేతానికి కృషి చేస్తూ యూత్ సమస్యల పై నిరంతరం పోరాటం చేస్తానని, నా నియమకానికి సహకరించిన బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ డా. ర్యాగ అరుణ్ కుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సుధాగోని నరేష్ గౌడ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల అధ్యక్షుడుగా ఎన్నికైన సందర్భంగా తోటి మిత్రులు వెంకన్నను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడబోయిన సాయి, దేశబోయిన నాగరాజు, మేడబోయిన నాగరాజు, యాదగిరి, శివ, నవీన్, శ్రీను, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కి ఎంపికైన జైపూర్ యువకుడు

వాస్తవం : జైపూర్

మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం కుందారం గ్రామానికి చెందిన శశాంక్ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్‌కు ఎంపికయ్యాడు. యుపీఎస్సీ నిర్వహించిన ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ 2025 పరీక్షలో దేశవ్యాప్తంగా 78వ ర్యాంక్ సాధించాడు. తెలంగాణ రాష్ట్రం నుంచి మొదటి ర్యాంక్ సాధించిన వ్యక్తిగా శశాంక్ రికార్డు సృష్టించాడు.

ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశంలో ఆది శ్రీనివాస్

వాస్తవం : చందుర్తి :

చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు బుధవారం నిర్వహించిన గృహ ప్రవేశ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, మాజీ జెడ్పిటి సభ్యులు నాగం కుమార్ పాల్గొన్నారు.

యువత వ్యాపార రంగాల్లో రాణించాలి

ఎమ్మెల్యే మందుల సామేలు

వాస్తవం : అడ్డగూడూరు :

యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధార పడకుండా వ్యాపార రంగంలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు అన్నారు. బుధవారం అడ్డగూడూరు మండల కేంద్రంలో పూలపల్లి రాజశేఖర్ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన సోమేశ్వర ఆటోమొబైల్స్ సేల్స్ అండ్ సర్వీస్ షాపును ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సామేలు మాట్లాడుతూ... స్వయం ఉపాధితో పాటు మరికొందరికి ఉపాధి కల్పించాలన్నారు.యువత తమకు నచ్చిన రంగాలలో శిక్షణ తీసుకున్నట్లయితే బ్యాంకులో రుణాలను మంజూరు చేస్తుందని తద్వారా చిన్న, మధ్యతరహా, భారీ వ్యాపారాలను చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. యువత నేటి కాలానుగుణంగా అన్ని అన్ని రకాల నైపుణ్యాలను కలిగి ఉండాలని, యువత తమలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీసి తమకు నచ్చిన రంగాలలో రాణించాలని అన్నారు. అనంతరం ప్రొప్రైటర్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మా వద్ద అన్ని రకాల ట్రాక్టర్లకు సర్వీస్, రిపేర్ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు జోజి, మోత్కూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, పట్టణ శాఖ అధ్యక్షులు పూలపల్లి సోమిరెడ్డి, వార్డు సభ్యులు సురేష్, సందీప్ రెడ్డి, కడారి రమేష్, కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షులు నాగులపల్లి రమేష్, గడ్డం సోమన్న, మందుల సోమన్న, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం

వాస్తవం : రాజేంద్రనగర్

అత్తాపూర్ సర్కిల్ హైదర్గూడ శ్రీ శ్రీ పోచమ్మ దేవాలయం త్రయోదశ వార్షికోత్సవ వేడుకలను నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ శ్రీ యోగానంద సరస్వతి స్వామి వారి ఆధ్వర్యంలో బుధవారం పార్వతి పరమేశ్వరుల కల్యాణోత్సవాలు కనులపండువగా జరిగాయి.తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త చెట్టిగారి నరేందర్ మాట్లాడుతూ... అమ్మ వారికి సహస్ర కళాభిషేకం, మహాగణపతి పూజ, మండ పారాధన, చండీ హోమం, రుద్ర హోమం, లలిత సహస్ర నామ కుంకుమార్చనలు సామూహికంగా నిర్వహించా మన్నారు. ఈ పూజా కార్యక్రమంలో హైదర్గూడా పరిసర ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారని తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ కమిటీ సభ్యులు పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు.

పిల్లలు లేని వారికి దత్తత ఒక వరం

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

చిన్నారుల దత్తత కార్యక్రమం

వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)

పిల్లలు లేని వారికి దత్తత ఒక వరం లాంటిదని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఇద్దరు చిన్నారులను దత్తతకు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలను చక్కగా చూసుకోవాలని చెప్పారు. ఎవరైనా చట్టబద్ధంగా సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ ద్వారా మాత్రమే ఆన్ లైన్ ద్వారా పిల్లలను దత్తతకు ఎంపిక చేసుకోవాలని సూచించారు. అలాకాకుండా ఇతర అక్రమ మార్గాలలో చేసు కున్నట్లయితే ఐదు సంవత్సరాల జైలు శిక్ష లక్ష రూపాయల జరిమానా ఉంటుందని హెచ్చరించారు.పిల్లలను పెంచే స్థోమత లేనటువంటి తల్లి తండ్రులు తమ పిల్లల్ని దత్తత కోసం అప్పగించవచ్చని జిల్లా కలెక్టర్ సూచించారు. పిల్లలను రోడ్డు మీద వదిలి వేస్తున్న వారి తల్లిదండ్రులపైన జువైనల్ జస్టిస్ చట్టం ప్రకారము చర్య తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లల ను నిర్లక్ష్యం చేసినా, వదిలివేయడానికి ప్రోత్సహించిన వారికి కూడా చట్ట ప్రకారం జైలు శిక్ష జరిమానా ఉంటుం దని స్పష్టం చేశారు. ప్రస్తుతం దత్తత కోసం చాలామంది ఎదురుచూస్తున్నా రని, ఎవరికైనా పిల్లలు పెంచే శక్తి లేనట్లయితే, అవాంచిత గర్భం అయిన ప్పుడు, వద్దు అనుకున్నట్లయితే పిల్లలని ప్రభుత్వ శిశు సంరక్షణ కేంద్రాలకు అప్పగించాలని, వారిని చట్ట ప్రకారం దత్తతకు పంపిస్తామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ స్పష్టం చేశారు. దత్తత తీసుకున్న తల్లిదండ్రులకు పిల్లల సంరక్షణ గురించి, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సూచనలు అందించారు. దీంతో ఆ పిల్లలకు మంచి జీవితాన్ని, వెలుగులు అందించ డం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, జిల్లా బాలల ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం గగన్ కుమార్ పాల్గొన్నారు.

డా. చరణ్ కౌశిక్ యాదవ్‌కి

శుభాకాంక్షలు తెలిపిన మాజీ కార్పొరేటర్ సిఎన్ రెడ్డి

వాస్తవం : జూబ్లీహిల్స్

తెలంగాణ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ చైర్మన్‌గా నూ తనంగా నియమితులయ్యారు డా. చరణ్ కౌశిక్ యాదవ్. బుధవారం మాసబ్ ట్యాంక్, విజయ్‌నగర్ కాలనీలోని కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సిఎన్ రెడ్డి హాజరై డా. చరణ్ కౌశిక్ యాదవ్‌కి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రతిభావంతులైన విద్యార్థులకు సన్మానం

వాస్తవం : హుస్నాబాద్ :

విద్యా వారోత్సవాల్లో భాగంగా మూడవరోజు బుధవారం హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన ప్రతిభావంతులైన విద్యార్థులను కళాశాల అధ్యాపక బృందం సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి . అనిల్ కుమార్ మాట్లాడుతూ... గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే కాకుండా వారి వ్యక్తిత్వ వికాసానికి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కళాశాల విద్యార్థిని చెన్నూరి జ్యోతి జెన్ పాక్ట్ కంపెనీలో గూగుల్ ప్రాసెస్ ఆక్టిబ్యూషన్లో ఫెవ్ ఐకాన్ గా ఎంపికై ఆకర్షణీయమైన జీతాన్ని పొందడం ద్వారా తమ కళాశాలకు మంచి గుర్తింపును తెచ్చిందని తెలిపారు. డి. హర్షవర్ధిని కళాశాలలో అత్యున్నతమైన మార్కులను పొందడమే కాకుండా అన్ని పోటీలలోనూ ప్రథమ స్థానంలో నిలుస్తున్న ప్రతిభావంతురాలైన విద్యార్థినిగా కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన మరియు ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యార్థులను సన్మానించడం ద్వారా వారి ప్రతిభకు పట్టం కట్టినట్టు అవుతుందని తెలిపారు.

నాణ్యమైన విద్య మరియు అధునాతనమైన కంప్యూటర్ ల్యాబ్ కలిగిన తమ కళాశాలను ఎంపిక చేసుకోవడం ద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన పాత్రికేయం కోసం..జర్నలిస్టుల హక్కుల సాధనకు
బలమైన గొంతుకగా ఉన్న సీనియర్ జర్నలిస్ట్
మానసాని కృష్ణా రెడ్డి జాతీయ అధ్యక్షులుగా ఉన్న
జర్నలిస్టుల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్)లో నేడే సభ్యులుగా చేరండి..చేర్పించండి
వాట్సాప్ చేయండి:8074124190
జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
Regd No. 914/2015
JSS
Journalists Sankshema Sangam
JOURNALISTS SANKSHEMA SANGAM
TELANGANA ANDHRAPRADESH TRADE UNION
మానసాని కృష్ణా రెడ్డి , జెఎస్ఎస్ జాతీయ అధ్యక్షులు ,9618616110

బండి సంజయ్ వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా స్పందిస్తోంది.బండి సంజయ్ వ్యతిరేక ఉద్యమాన్ని ఉధృతంగా చేపడుతున్న విషయాన్ని చూస్తున్నాం. ఆ పార్టీ గట్టిగానే బండి మీద మండిపడు తోంది.బండిని కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తోంది.అయితే బండి విషయంలో బీఆర్ఎస్ ఇంతలా స్పందిం చడం వెనక కారణాలు ఏంటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాము అధికారంలో ఉన్నప్పుడు బండి తమ సర్కార్‌ని ఇరుకున పెట్టారనే కోపమా?లేక కేసీఆర్,కేటీఆర్‌ల మీద బండి సంజయ్ గతంలో తీవ్ర ఆరోపణలు చేసిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు బండి మీద రివెంజ్ తీర్చుకుం టున్నారా? అనే వాదనలు విన్పిస్తున్నాయి. అయితే బండి విషయంలో బీఆర్ఎస్ ముఖ్య నేతలు తీవ్రంగా స్పందించడం వెనక మరేదో బలమైన కారణం ఉండి ఉంటుందనే గుసగుసలు విన్పిస్తున్నాయి.తమ కుటుంబాన్ని తీవ్రంగా వ్యతిరేకించే బండి వంటి నేతను ఇదే అదునుగా పదవి నుంచి తప్పించడానికి ఒత్తిడి పెంచాలనే వ్యూహంతోపాటు కేంద్ర మంత్రి బండి సంజయ్,తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిలు కల్సి కేసీఆర్ కూతురు కవితతో కొత్త పార్టీ పెట్టించి తమని తిట్టిస్తున్నారని కేసీఆర్ ఫ్యామిలీ నమ్ముతున్నదనే ప్రచారం ఉంది.దీంతో ఇప్పుడు అదును దొరికింది కావున బండిని కేంద్రం నుంచి తప్పించాలని బీఆర్ఎస్ గట్టి పట్టుదలగా ఉన్నదని అంటున్నారు.

బండికి పోగ రేవంత్‌కు సెగ

పోక్సో కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ వ్యవహారం రోజురోజుకు బలపడుతోంది.సాయి భగీరథ్‌ని అరెస్ట్ చేయకుండా కాపాడుతున్నారని రేవంత్ ప్రభుత్వం , కేంద్ర మంత్రి బండి సంజయ్‌లకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం తీవ్ర రూపం దాల్చింది.ఈ వ్యవహారంలో బండికి సన్‌స్ట్రోక్ తగిలినట్లుగానే కన్పిస్తోంది.

- బండి సంజయ్ రాజీనామా తప్పదా?
- తెరవెనక చక్రం తిప్పుతున్నది వారేనా?
- అనుకూల,వ్యతిరేక ప్రచారం వెనక ఉన్నది ఆయనేనా?
- బండికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ కొట్లాట అందుకేనా?
- రేవంత్ రెడ్డి సర్కార్ భగీరథ్‌ని ఎందుకు కాపాడుతోంది?
- కల్వకుంట్ల కవిత మౌనం అందుకేనా?

పోక్సో కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ వ్యవహారం రోజురోజుకు బలపడుతోంది.సాయి భగీరథ్‌ని అరెస్ట్ చేయకుండా కాపాడుతున్నారని రేవంత్ ప్రభుత్వం , కేంద్ర మంత్రి బండి సంజయ్‌లకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం తీవ్ర రూపం దాల్చింది.ఈ వ్యవహారంలో బండికి సన్‌స్ట్రోక్ తగిలినట్లుగానే కన్పిస్తోంది.ఎన్నో యేండ్లుగా కష్టపడి ఈ స్థాయికి వచ్చిన బండి రాజకీయ జీవితానికి ఇది పెద్ద ఘాతంగానే కన్పిస్తోంది.విచారణలో బండి భగీరథ్ మీద వచ్చిన ఆరోపణల్లో ఏ మాత్రం నిజం ఉన్నా ఇక ఆయన కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయక తప్పదనే సంకేతాలు కన్పిస్తున్నాయి.గల్లీ నేత నుంచి ఢిల్లీ వరకు ఎదిగిన బండికి ఈ పరిస్థితి సంకటమే. దీనికి కారణం స్వయంకృతాపరాధమేనని అంటున్నారు.కుమారుడి వ్యవహారంలో ఆరోపణలు వచ్చిన సందర్భంలోనే కుమారుడిని కట్టడి చేసుకుని ఉండి ఉంటే నేడు ఈ పరిస్థితి దాపురించి ఉండేది కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రజాజీవితంలో ఉన్నప్పుడు వ్యక్తిగత జీవితం కూడా ముఖ్యమే.ఏ చిన్న పొరపాటు దొర్లినా నేల కరవాల్సిందే.ఇప్పుడు బండి వ్యవహారంలో ఇదే సూచనలు కన్పిస్తున్నాయి.అయితే బండి సంజయ్‌ని దెబ్బతీయడానికి ఓ పథకం ప్రకారమే ప్రత్యర్థులు వ్యూహం పన్నినట్లుగా ప్రచారం జరుగుతోంది.అదును చూసి బండిని దెబ్బతీశారని అంటున్నారు.ఈ వ్యవహారంలో కుమారుడి కదలికలపై కన్నేసి పక్కా స్కెచ్ వేసినట్లుగా గుసగుసలు విన్పిస్తున్నాయి.వాస్తవానికి గత టీఆర్ఎస్ సర్కార్‌పై బండి సంజయ్ గట్టిగా కొట్లాడిండు.నిత్యం కేసీఆర్ సర్కార్ వైఫల్యాలని చీల్చిచెండాడు. బీజేపీ క్యాడర్‌లో ఉత్తేజాన్ని నింపారు.బండి బీజేపీ రాష్ట్ర సారథిగా ఉన్న సమయంలోనే రాష్ట్రంలో కమలం అనేక సందర్భాల్లో వికసించింది.దీంతో ఒకానొక దశలో రాష్ట్రంలో బీజేపీదే అధికారం అనే ప్రచారం కూడా ప్రజల్లో బాగా మెదిలింది.దానికి తగ్గట్లుగానే బండి కార్యక్రమాలు ఉండేవి.చిన్న అవకాశం చిక్కినా బండి నానా హంగామా చేసి కేసీఆర్ సర్కార్‌ని ఇరుకున పెట్టిన విషయం తెల్సిందే. ఒక్కోసారి కేసీఆర్ అండ్ ఫ్యామిలీపై శృతిమించిన ఆరోపణలు కూడా చేసేవారు. ప్రభుత్వాన్ని విమర్శించే సందర్భంలో అదుపు లేని మాటలు కూడా విసిరేవారు.ఇలా కేసీఆర్ హయాంలో బండి సంజయ్ బీజేపీ అధికారంలోకి వస్తే సీఎం అభ్యర్థిగా ఉంటారనే స్థాయికి ఎదగడం చూశాం.అయితే బీజేపీ అధినాయకత్వం కావాలనే సెల్ఫ్ గోల్ వేసుకుని బండిని సారథ్య బాధ్యతల నుంచి తప్పించడంతో ఒక్కసారిగా ఎన్నికల పోటీ నుంచి కమలం తప్పుకుని కాంగ్రెస్‌ని రేస్‌లోకి వచ్చేలా నాటి రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయని అంటారు.ఇందులో నిజానిజాల సంగతి ఎలా ఉన్నా కరీంనగర్‌లో లోకల్ లీడర్‌గా ఉన్న బండి ఎట్టకేలకు కేంద్ర హోం సహాయ మంత్రిగా ఎదగడం వరకు జరిగిపోయాయి. అయితే రాజకీయం ఎప్పటికీ ఒకేలా ఉండదు. సాఫీగా సాగుతున్న బండి రాజకీయ ప్రస్థానం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.దీనికి ప్రధాన కారణం ఆయనే.ఎందుకంటే తన కుమారుడుని అదుపులో ఉంచుకోకపోవడమే ఇప్పుడు తన రాజకీయ భవిష్యత్‌ని నాశనం చేసింది. ఇక మరో అంశం కూడా బండికి వ్యతిరేకంగా తీవ్రంగా పనిచేస్తోందంటున్నారు.తెలంగాణ రాష్ట్ర బీజేపీలో వర్గపోరు తీవ్రంగానే ఉంది. ఇందులో ఓ వర్గం బండిది కాగా..మరో వర్గం ఈటలది అంటారు.ఈటల రాజేందర్‌కి తగిన ప్రాధాన్యం,పదవి దక్కకుండా బండి వర్గం పనిచేస్తోందంటూ చాలా కాలంగా ప్రచారం ఉంది.ఈ విషయంలో అప్పుడప్పుడు ఈటల కూడా తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూనే ఉన్నారు.ఇప్పుడు బండి కుమారుడి వ్యవహారంలో బండి వ్యతిరేక వర్గమే సామాజిక మాధ్యమాల్లో బండికి వ్యతిరేకంగా ఉధృతంగా ప్రచారం చేపట్టేలా ఎత్తులు వేస్తున్నారనే ప్రచారం కూడా ఉంది.ఏదైనా సంఘటన జరిగినప్పుడు ప్రధాన మీడియాలు మౌనంగా ఉన్నా సోషల్ మీడియా వదలదు.బండి కుమారుడి వ్యవహారంలో కూడా ఇదే జరిగింది. అయితే సోషల్ మీడియాలో ఒకేవిధమైన వార్తలు..ఒకే కంటెంట్ రావడం వెనక బండికి వ్యతిరేకంగా ఏదో శక్తి బలంగా పనిచేస్తోందంటూ గుసగుసలు విన్పిస్తున్నాయి.తాజాగా బండి కుమారుడ కనిపించడం లేదని హైదరాబాద్‌లో పోస్టర్లు వెలిశాయి. షేరిలింగంపల్లి, గచ్చిబౌలి సహా అనేక ప్రాంతాల్లో బుధవారం ఉదయం ఈ పోస్టర్లు కలకలం సృష్టించాయి. బండి భగీరథ్ ఆచూకీ తెలిస్తే పోలీస్ స్టేషన్‌లో చెప్పండి అంటూ మెట్రో పిల్లర్లు, బస్టాప్‌లు, ప్రధాన కూడళ్లలో పలువురు ఈ పోస్టర్లను అతికించారు.మరోవైపు పలువురు బండి భగీరథ్ కనిపించడం లేదంటూ హైదరాబాద్ మెట్రోలో ప్రచారం చేశారు. మీకు ఎవరికైనా కనిపిస్తే డయల్ 100కు కాల్ చేసి సమాచారం చెప్పండి అంటూ విజ్ఞప్తి చేశారు.ఇంత పెద్ద ఎత్తున బండికి వ్యతిరేకంగా ప్రచారం చేయడం వెనక స్వంత పార్టీ నేతలే ఉండి ఉంటారనే ఊహాగానాలు వస్తున్నాయి. లక్షలాది రూపాయలు ఖర్చుచేసి బండిని ప్రజల్లో దోషిగా నిరూపించే ఎత్తులు వేస్తున్నారని బండి వర్గం అంటోంది.ఇదే విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మంగళవారం కరీంనగర్‌లో బండి సంజయ్ మాట్లాడుతూ తన కుటుంబంపై అన్యాయంగా ఆరోపణలు చేస్తున్నారని తనని ఇబ్బంది పెడుతున్నారని అలాంటివారిని వదిలే ప్రసక్తిలేదంటూ చేసిన వ్యాఖ్యలు స్వంత పార్టీనేతలను ఉద్దేశించి చేసిన వేనని అంటున్నారు.ఇక ఇదిలా ఉంటే బండి సంజయ్ వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా స్పందిస్తోంది.బండి సంజయ్ వ్యతిరేక ఉద్యమాన్ని ఉధృతంగా చేపడుతున్న విషయాన్ని చూస్తున్నాం. ఆ పార్టీ గట్టిగానే బండి మీద మండిపడుతోంది.బండిని కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తోంది.అయితే బండి విషయంలో బీఆర్ఎస్ ఇంతలా స్పందించడం వెనక కారణాలు ఏంటనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.తాము అధికారంలో ఉన్నప్పుడు బండి తమ సర్కార్‌ని ఇరుకున పెట్టారనే కోపమా?లేక కేసీఆర్,కేటీఆర్‌ల మీద బండి సంజయ్ గతంలో తీవ్ర ఆరోపణలు చేసిన విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు బండి మీద రివెంజ్ తీర్చుకుంటున్నారా? అనే వాదనలు విన్పిస్తున్నాయి. అయితే బండి విషయంలో బీఆర్ఎస్ ముఖ్య నేతలు తీవ్రంగా స్పందించడం వెనక మరేదో బలమైన కారణం ఉండి ఉంటుందనే గుసగుసలు విన్పిస్తున్నాయి.తమ కుటుంబాన్ని తీవ్రంగా వ్యతిరేకించే బండి వంటి నేతను ఇదే అదునుగా పదవి నుంచి తప్పించడానికి ఒత్తిడి పెంచాలనే వ్యూహంతోపాటు కేంద్ర మంత్రి బండి సంజయ్,తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిలు కల్సి కేసీఆర్ కూతురు కవితతో కొత్త పార్టీ పెట్టించి తమని తిట్టిస్తున్నారని కేసీఆర్ ఫ్యామిలీ నమ్ముతున్నదనే ప్రచారం ఉంది.దీంతో ఇప్పుడు అదును దొరికింది కావున బండిని కేంద్రం నుంచి తప్పించాలని బీఆర్ఎస్ గట్టి పట్టుదలగా ఉన్నదని అంటున్నారు.ఇందులో నిజానిజాల సంగతి ఎలా ఉన్నా బండిని గట్టి దెబ్బ కొట్టాలని బీఆర్ఎస్ గట్టి పట్టుదలగా ఉందన్నది స్పష్టంగా అర్థమవుతోంది.ఇక బండి సంజయ్ కుమారుడి విషయంలో రేవంత్ సర్కార్ సరిగ్గా స్పందించకుండా నిందితుడిని కాపాడే యత్నం చేస్తోందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.ఈ ఆరోపణలను రేవంత్ ప్రభుత్వం కొనితెచ్చుకున్నట్లయింది.తన మీద లైంగిక దాడి జరిగిందని ఓ మైనర్ ఫిర్యాదు చేసినప్పుడు వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి నిందితుడిని అదుపులోకి తీసుకోవాల్సిన పోలీసులు పట్టనట్లుగా వ్యవహరించారనే ఆరోపణలు చుట్టుముట్టాయి. కావాలనే బండిని కాపాడటానికే రేవంత్ రెడ్డి వ్యవహరించారని అన్ని వైపులా విమర్శలు వెల్లువెత్తిన తర్వాత ప్రభుత్వం సిట్ వేయడం గమనార్హం.ఇలా సిట్ వేయడం మంచి పరిణామమే కావచ్చు..కానీ సామాన్యుల మీద కూడా ఆరోపణలు వచ్చే సందర్భంలో ఇలా నిందితులను అరెస్ట్ చేయకుండా సిట్‌లు వేసి విచారణ అనంతరం అరెస్ట్ చేస్తారా? అనే ప్రశ్నకు సమాధానమే లేదు.ఆరోపణలు రాగానే నిజాయితీగా విచారించి తగు చర్యలు తీసుకునే విధానం మంచిదే..అయితే న్యాయం అందరికీ ఒకేలా ఉండాలని..సామన్యులకో నీతి.. బలవంతులకో రాజ్యాంగమా ? అనే విమర్శలు వస్తున్నాయి.అయితే నలువైపుల నుంచి విమర్శలు వచ్చిన రెండు రోజుల తర్వాతీ సీఎం రేవంత్ రెడ్డి కేసు విషయంలో స్పందించినట్లుగా ప్రచారం జరిగింది.డీజీపీని ప్రశ్నించి సీరియస్ అయినట్లుగా కూడా వార్తలు వచ్చాయి.ఈ క్రమంలో ప్రత్యేక సిట్ ఏర్పాటు చేసి విచారణకు బండి భగీరథ్‌ని బుధవారం విచారణకు పిలిచిన పోలీసులకు చుక్కెదురయింది.విచారణకు బండి భగీరథ్ హాజరు కాలేదు.అసలు బండి భగీరథ్ విదేశాలకు పారిపోయినట్లుగా ఆరపోపణలు వస్తున్నాయి. ఇలా తీవ్రమైన ఆరోపణలు ఉన్న నిందితుడు తప్పించుకుపోవడానికి రేవంత్ రెడ్డి సర్కార్ ఉదాసీనతే కారణమని అంటున్నారు.ఫిర్యాదు అందగానే చట్టం తన పని తాను చేసి ఉన్నట్లయితే రేవంత్ రెడ్డి ప్రభుత్వం విమర్శలను ఎదుర్కొని ఉండేది కాదు.ఇప్పుడు నలువైపుల నుంచి బండిని కాపాడటానికి రేవంత్ ఎత్తులు వేస్తున్నారనే ఆరోపణలు ముసురుకున్నాయి.దీన్ని జనం నమ్మేలా పరిణామాలు కూడా జరుగుతున్నాయి.మంచి అవకాశాన్ని ప్రతిపక్షాలకు కల్పించి సీఎం రేవంత్ రెడ్డి ఆత్మరక్షణలో పడిపోయారు.చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు ప్రభుత్వ వైఖరి ఉంది. బండి సంజయ్ కుమారుడిపై తాజాగా కొన్ని సెక్షన్లను అదనంగా చేర్చారు. పోక్సో చట్టం సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జత చేశారు. ఇంతకుముందు బాలిక తల్లి ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో చట్టం, బీఎన్ఎస్ 74, 75 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇదివరకు లైంగిక వేధింపులుగా భావించిన పోలీసులు ఇప్పుడు సెక్షన్లను మార్చడం కేసు తీవ్రత మరింత పెరిగినట్లుగా ఉంది. ఈ నెల 8న బాధితురాలైన మైనర్‌పై లైంగిక వేధింపులు జరిగాయంటూ ఆమె తల్లి పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లినప్పుడు.. పోలీసులు హైడ్రామా మధ్య సెక్షన్ 74, 75 అఫ్ బీఎన్ఎస్, సెక్షన్ 11 రెడ్ విత్ 12 ఆఫ్ పోక్సో యాక్ట్ 2012 మేరకు కేసులు నమోదు చేశారు. ఆ తరువాత బాధితురాలి నుంచి మహిళా అధికారులు వాంగ్మూలం తీసుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు బాధితురాలు నిజం చెప్పకుండా ఉండేలా ఒత్తిళ్లు తెచ్చారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో అన్ని వైపుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగడంతో.. ప్రభుత్వం సోమవారం కూకట్‌పల్లి జోన్ డీసీపీ రితిరాజ్‌ను ప్రత్యేక దర్యాప్తు అధికారిగా నియమించింది. వెంటనే దర్యాప్తును చేపట్టిన రితిరాజ్ సోమవారం సాయంత్రం పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఘటన గురించి ఆరా తీశారు.అప్పటికే పోలీసులు బాధితురాలి నుంచి తీసుకున్న వాంగూల్మాన్ని పరిశీలించారు. అందులో స్పష్టత లేకపోవడంతో మరింత లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం నేరుగా బాధితురాలిని కలిసి జరిగిన విషయం తెలుసుకున్నారు. పోక్సో కేసు దర్యాప్తులో మహిళా అధికారులు ఫ్రెండ్లీ వాతావరణంలో బాధితురాలి నుంచి జరిగిన ఘటనకు సంబంధించిన అంశాలను సేకరించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే రితిరాజ్ నేరుగా బాధితురాలి ఇంటికి వెళ్లి ఆమెతో చాలాసేపు మాట్లాడినట్టు తెలిసింది. బాధితురాలు చెప్పిన విషయాలకు పోలీసులు కేసు నమోదు చేసిన సెక్షన్లకు పొంతన లేని విషయాన్ని ఆమె గుర్తించారు. బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా జరిగిన నేరం అత్యంత తీవ్రమైనదని గ్రహించిన డీసీపీ ఆ మేరకు కేసులో సెక్షన్లను అలర్ట్ చేయించారు. పోక్సో చట్టంలోని సెక్షన్ 5(1) రెడ్ విత్ 6ను జోడించారు. కొత్తగా అలర్ట్ చేసిన సెక్షన్లతో పోలీసులు మంగళవారం భగీరథ్‌కు నోటీసులు జారీచేశారు. దర్యాప్తు బృందం నోటీసులు ఇవ్వడానికి కరీంనగర్ వెళ్లినప్పుడు.. అక్కడ భగీరథ్ లేకపోవడంతో అతడి మేనమామ డాక్టర్ వంశీకృష్ణకు అందజేశారు. బండి సాయిభగీరథ్‌పై పేట్‌బషీరాబాద్‌లో నమోదైన 684/2026 కేసులో నిందితుడిగా ఉన్నాడని, అతనిపై పోక్సో కేసు నమోదైందని, పలు అభియోగాలున్నాయని నోటీసులో పేర్కొన్నారు. ఈ మేరకు 13వ తేదీ మధ్యాహ్నం బండి సాయి భగీరథ్‌ను విచారణకు తీసుకొని రావాలంటూ ఆయనకు సూచన చేశారు. ఇదిలాఉండగా భగీరథ్ ఫోన్ స్విచాఫ్‌లో ఉందని పోలీసులు గుర్తించారు.మొత్తం మీద వ్యవహారంలో స్పష్టంగా అర్థమవుతున్న విషయం ఒక్కటే.. భగీరథ్ వ్యవహారంలో ఓ వైపు బండికి పొగ..మరోవైపు రేవంత్‌కు సెగ తగిలిందనే చెప్పవచ్చు.రానున్న రోజుల్లో బండి భగీరథ్ కేసు ఏ మలుపులు తిరుగుతుందో అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

.....
మానసాని కృష్ణారెడ్డి
9618616110
.....